క్లుప్తంగా

విరాళం అందజేత



దాతను సన్మానిస్తున్న గ్రామస్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని హస్తాల్ పూర్ గ్రామ శివారులోని లక్ష్మీనర్సింహస్వామి దేవాలయాన్ని గ్రామస్తులు దాతల సహకారంతో అభివృద్ధి చేస్తున్నారు. దీంతో ఆలయ పునః నిర్మాణ పనులు కొద్ది రోజులుగా చురుకుగా కొనసాగుతున్నాయి. ఆలయ అభివృద్ధికి హైదరాబాద్‌లో స్థిరపడిన గ్రామానికి చెందిన అల్లెంకి నాగమణి, బాలరాజ్ దంపతులు రూ. ఒక లక్ష విరాళం అందజేశారు. దీంతో దాతను ఆలయ కమిటీ తరపున గ్రామస్తులు శాలువాతో సత్కరించి స్వామివారి ఫొటో అందజేశారు. కార్యక్రమంలో పెంటారెడ్డి, లక్ష్మీనారాయణ, పాండురంగం, అనికె రాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): కొత్తగా పట్టాపాస్ బుక్ వచ్చిన రైతులు రైతుబంధుకు దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రమ్య అన్నారు. గురువారం ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొత్త పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు తమ ఆధార్ కార్డు, పట్టా పాస్‌బుక్, బ్యాంకు ఖాతా బుక్ జిరాక్స్‌లతో పాటు, రైతుల మొబైల్ నంబర్‌ను దగ్గరలో ఉన్న ఏఈఓకు అందజేయాలన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమ్మె



సమ్మె చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వివిధ గ్రామాల్లో బీపీఎంలు, డాక్ సేవక్‌లు సమ్మె బాట పట్టారు. తమ సమస్యలను పరిష్కరించాలని సమ్మె చేస్తున్నారు. అధికారులు స్పందించి పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

బస్సులు ఆపాలని వినతి

దౌల్తాబాద్(దుబ్బాక): మండల పరిధిలోని ముబారస్‌పూర్ స్టేజీ వద్ద ఆర్టీసీ బస్సులు ఆపడం లేదని మల్లేశంపల్లి, శౌరీపూర్ గ్రామాల సర్పంచ్ దార సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం గజ్వేల్‌– ప్రజ్ఞాపూర్ డిపో ప్రతినిధికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైమద్‌నగర్ స్టేజీ వద్దనే బస్సులు ఆపి, ముబారస్‌పూర్ వద్ద బస్టాండ్ ఉన్నా బస్సులు ఆపడం లేదన్నారు. దీంతో మల్లేశంపల్లి, శౌరీపూర్ ముబారస్‌పూర్, సూరంపల్లి, తదితర గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని వాపోయారు. ఆర్టీసీ అధికారులు తక్షణమే స్పందించి బస్సులు ఆపే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్



ఓఎస్‌సీ సర్వే నిర్వహిస్తున్న సీఆర్పీ రమేశ్

గజ్వేల్‌రూరల్: చదువుతోనే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎంఈఓ సునీత పేర్కొన్నారు. గజ్వేల్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్, తిమ్మకపల్లి గ్రామాల్లో గురువారం ఓఎస్‌సీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని సూచించారు. బడీడు పిల్లలను పనిలో చేర్పించవద్దని, వారి బంగారు భవిష్యత్‌కు బాటలు వేసేలా తల్లిదండ్రులు చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో సీఆర్పీ రమేశ్ పాల్గొన్నారు.

'భట్టి'ని కలిసిన కొమ్మెర

గజ్వేల్: రాష్ట్ర ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను గురువారం హైదరాబాద్‌లో గజ్వేల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కొమ్మెర వెంకటరెడ్డి కలిశారు. ఈసందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు.



డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వెంకటరెడ్డి

వరి తూకాన్ని కాపాడుకోవాలి

ఏడీఏ పుణ్యవతి

కౌడిపల్లి(నర్సాపూర్): చలి తీవ్రత నుంచి వరి తూకాలను కాపాడుకోవాలని ఏడీఏ పుణ్యవతి అన్నారు. గురువారం కౌడిపల్లిలో పలువురు రైతుల వరి నారుమడులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చలి తీవ్రత అధికంగా ఉన్నందున రైతులు నారుమడులను రక్షించుకోవాలని చెప్పారు. ప్రతీ రోజు ఉదయం రాత్రి నారుమడిలో ఉన్న నీటిని తీసేసి ఉదయం బోరు నీరు పెట్టాలన్నారు. దీంతో నారుకు చలి తీవ్రత తగ్గుతుందన్నారు. నారుమడిపై చలి, మంచు కురవకుండా పల్చటి టార్పలిన్ ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. నారుమడిలో జింక్ లోపం ఉన్నట్లయితే జింక్ సల్ఫేట్‌ను చల్లాలన్నారు. నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియాతో కార్బండిజిమ్, మాంకోజెట్ మిశ్రమాన్ని కలిపి స్ప్రే చేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు నివారణకు కార్బోపురాన్ 3జీ గుళికలు చల్లాలని వివరించారు. రైతులు సమస్యలుంటే వ్యవసాయ అధికారులను సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ శ్వేతకుమార్ రైతులు పాల్గొన్నారు.

నారుమడి రక్షణ చర్యలు

టేక్మాల్(మెదక్): యాసంగిలో చలి ప్రభావం నుంచి నారు మడుల్లో నారు ఎదగక పోవటం, కొన్ని సార్లు నారు చనిపోవటం వంటి వాటిపై రైతులకు వ్యవసాయాధికారి రాంప్రసాద్ రక్షణ చర్యలను వివరించారు. సాయంత్రం వేళలో నారుమడిలో నీరు తీసేసి పగటి పూట వెచ్చటి నీరు పెడుతూ ఉండాలి. జింకు లోపం వలన ఆకులపై తుప్పు మచ్చలు ఏర్పడుతాయి. కావున జింకు సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. నారు ఆరోగ్యంగా పెరగడానికి యూరియా వేస్తున్నప్పుడు ఒక కిలో యూరియాకి 2 గ్రాముల కార్బెండాజిమ్ + మాంకోజెబ్ మిశ్రమ మందును కలిపి పిచికారీ చేయాలి. కాండం తొలుచు పురుగు బారి నుంచి కాపాడుకోడానికి కార్బోఫురాన్ 3 జీ గుళికలు ఎకరాకు సరిపడే నారుమడికి ఒక కిలో చొప్పున చల్లాలి.

అగ్గి తెగులు ఆశించకుండా ముందు జాగ్రత్తగా ట్రైసైక్లేజాల్ 0.6 గ్రాములు లీటర్ నీటికి చొప్పున పిచికారీ చేయాలి.



కౌడిపల్లిలో వరి నారుమడిని పరిశీలిస్తున్న ఏడీఏ



వ్యవసాయాధికారి రాంప్రసాద్

భగవద్గీత పుస్తకాల అందజేత

పెద్దశంకరంపేట(మెదక్): ప్రతీ ఒక్కరూ ఆధ్యాత్మిక గ్రంథం భగవద్గీతపై అవగాహన పెంచుకోవాలని సర్పంచ్ అలుగుల సత్యనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో ఇస్కాన్ టెంపుల్ అత్తాపూర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రవచనాలు భక్తి భజనలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంద మందికి ఉచితంగా భగవద్గీత పుస్తకాలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భగవద్గీతతో పాటు విద్యార్థులకు రామాయణ, మహాభారత ఇతిహాసాలను చదివించడం అలవాటు చేయాలని అన్నారు. ఇస్కాన్ టెంపుల్ వారు గ్రామ గ్రామాన హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రచారం చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోణం విఠల్, శిశు మందిర్ ప్రధానాచార్యులు వీరప్ప, హిందూ సంఘాల బాధ్యులు సీతారామారావు, జైహింద్ రెడ్డి, ఎర్ర శ్రీహరి, శ్రావణ్ కుమార్, సతీశ్‌గౌడ్, సర్వేశ్వర్, రవి వర్మ, శైలేష్, కాజీపల్లి సంతోష్ కుమార్, గాండ్ల సంగమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సర్పంచ్

శబరిమలకు తరలిన స్వాములు

చిన్నశంకరంపేట(మెదక్): అయ్యప్ప స్వాములు శబరిమలకు బయలుదేరారు. గురువారం మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయం వద్ద గురు స్వాముల ఆధ్వర్యంలో పడిపూజ నిర్వహించారు. అనంతరం శబరిమల యాత్రకు అయ్యప్పస్వాములు ఇరుముడితో వెళ్లారు. గురుస్వాములు రమేశ్‌గౌడ్, రంగారావు, నరేందర్, బాలకృష్ణ తదితర స్వాములు ఉన్నారు.



శబరిమలకు వెళ్తున్న స్వాములు

మంత్రిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మంత్రికి శుభాకాంక్షలు తెలుపుతున్న నేతలు



మంత్రి దామోదర రాజనర్సింహతో నాయకులు

నర్సాపూర్: రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పలువురు కాంగ్రెస్ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సాపూర్‌కు చెందిన పీసీసీ ప్రధాన కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, తాత్కాలిక డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌లు గురువారం మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి సన్మానించారు. అనంతరం పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట పలువురు కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

రేగోడ్(మెదక్): వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్, జెడ్పీటీసీ యాదగిరి, నరేందర్ గురువారం కలిశారు. సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు చేసి బాధ్యతలు తీసుకున్న అనంతరం దామోదరకు కాంగ్రెస్ నాయకులు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఓటరు జాబితా పకడ్బందీగా చేపట్టాలి

● నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్

వెల్దుర్తి(తూప్రాన్): రానున్న పంచాయతీ ఎన్నికల నాటికి ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని నర్సాపూర్ ఆర్డీఓ శ్రీనివాస్ సూచించారు. ఈ మేరకు వెల్దుర్తి తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలకు అవగాహన సదస్సు ఏర్పాటు చేసి పలు సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు తుది జాబితాలో ఎలాంటి తప్పులకు అవకాశం ఇవ్వకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు. 18 ఏళ్ల నిండిన వారు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. జాబితాలో మార్పులు, చేర్పులు, మరణించిన వారి పేర్ల తొలగింపు వంటి వాటిని జాగ్రత్తగా చేపట్టాలన్నారు. సమావేశంలో తహసీల్దార్‌లు తులసీరాం, జ్ఞానజ్యోతి, గిర్దావర్ జయభారత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

నిజాంపేట(మెదక్): మండల కేంద్రం నిజాంపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో మెదక్ ఆర్డీఓ అంబదాస్ రాజేశ్వర్ గురువారం బీఎల్ఓలకు ఓటరు నమోదుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వచ్చే పార్లమెంట్ ఎన్నికలకు, స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకోని ఓటరు జాబితాలో మరణించిన వారివి, డబుల్ ఓటరులను తొలగించాలని తెలిపారు. ఓటర్లకు సంబంధించి అడ్రస్ మార్పు కానీ, ఏమైనా తప్పులను సవరించడానికి మరో అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికి ఓటు నమోదు చేయించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సురేశ్ కుమార్, ఆర్ఐ గంగాధర్, బీఎల్ఓ సూపర్‌వైజర్లు, బీఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేటలో బీఎల్ఓలకు సూచనలిస్తున్న ఆర్డీఓ



వెల్దుర్తి(తూప్రాన్): తహసీల్దార్ కార్యాలయంలో..

పెద్దమ్మ ఆలయ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



హోమం నిర్వహిస్తున్న భక్తులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేట గ్రామంలో పెద్దమ్మ ఆలయ వార్షికోత్సవ ఉత్సవాలకు గురువారం శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యావాచనం, రక్షాబంధన, మాతృక, నవగ్రహ పూజలు చేశారు. అనంతరం పంచసూక్త హోమం నిర్వహించారు. ఈ కార్యకర్మంలో సర్పంచ్ శ్రీలతస్వామిరాజ్, ఎంపీటీసీ శివకుమార్, ముదిరాజ్ సంఘం నాయకులు భూషణం, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

నేడు శివ్వంపేటలో మండల సమావేశం

హాజరుకానున్న నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ హరికృష్ణ తెలిపారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి ముఖ్య అతిథిగా వస్తున్నారని చెప్పారు. అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సభకు హాజరుకావాలని సూచించారు. గ్రామాల్లో నెలకొన్న ప్రజా సమస్యలపై చర్చించనున్నట్లు వివరించారు.

రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోండి

వర్గల్(గజ్వేల్): మండలంలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు పొందిన రైతులు రైతుబంధు కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి శేషశయన సూచించారు. ఆధార్‌కార్డు, పట్టా పాస్ పుస్తకం, బ్యాంక్ అకౌంట్ పాస్‌బుక్ జిరాక్సులను దరఖాస్తు ఫారానికి జతచేసి ఆయా గ్రామాల వ్యవసాయ విస్తరణాధికారులకు అందజేయాలని పేర్కొన్నారు.

రోడ్డు మరమ్మతు పనులు పూర్తి



నాడు వర్షాకాలంలో రోడ్డు దుస్థితి



నేడు..

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారం నుంచి గుండ అంసాన్‌పల్లి వరకు వేసిన తారురోడ్డు పూర్తిగా దెబ్బతిన్నది. ఎక్కడికక్కడ గుంతలు పడి, ఏళ్ల తరబడిగా మరమ్మతులకు నోచుకోక మండల కేంద్రంకి వెళ్లే ప్రజలతో పాటు అటువైపుగా ప్రయాణించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు మరమ్మతుల కోసం ప్రజాప్రతినిధుల నిలదీత, ఆందోళనల మధ్య ఎట్టకేలకు రోడ్డు మరమ్మతు పనులు పూర్తయ్యాయి. దీంతో మండల కేంద్ర, సమీప గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అసంపూర్తిగా వీధి దీపాల పనులు



తూప్రాన్ - నర్సాపూర్ హైవే



లైట్ల కోసం తెచ్చిన స్తంభాలు

శివ్వంపేట(నర్సాపూర్): మండల కేంద్రం శివ్వంపేటలో ఏర్పాటు చేయనున్న వీధి దీపాల (ఎల్ఈడీ) పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. తూప్రాన్ – నర్సాపూర్ హైవే శివ్వంపేట ప్రధాన రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌పై స్ట్రీట్ లైట్స్ ఏర్పాటుకు మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి రూ.10 లక్షలు, మెదక్ మాజీ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి రూ.10 లక్షల చొప్పున నిధులు మంజూరు చేశారు. పనులు ప్రారంభించిన సదరు కాంట్రాక్టర్ పూర్తిస్థాయిలో చేయకుండా అసంపూర్తిగా వదిలేశాడు. గుంతలు తవ్వి, దీపాల ఏర్పాటుకు రూ.20 లక్షల నిధులు సరిపోకపోవడంతో డివైండర్‌కు ఇరువైపులా పనులు ప్రారంభ దశలోనే ఆగిపోయాయి. మరో రూ.4 లక్షలు అదనంగా మంజూరు చేస్తే పనులు పూర్తి అవుతాయి. ప్రస్తుత ఎమ్మెల్యే సునీతారెడ్డి తన కోటా నుంచి అదనపు నిధులు మంజూరు చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

పనులు పూర్తి చేయిస్తాం

తూప్రాన్ – నర్సాపూర్ హైవే శివ్వంపేట ప్రధాన రోడ్డుపైన అసంపూర్తిగా నిలిచిన స్ట్రీట్ లైట్ల పనులు త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం. ఎన్నికల నేపథ్యంలో ఆలస్యం అయింది. రెండు రోజుల్లో స్తంభాలు ఏర్పాటు చేయించి, లైట్ల బిగింపు చేపడతాం.

– భాస్కర్‌రావు, పీఆర్, ఏఈ

చెరువు కట్ట తూము ధ్వంసం

● వృథాగా పోతున్న చెరువులోని నీరు
● చోద్యం చూస్తున్న రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

తూప్రాన్: అక్రమార్కులు పట్టణ సమీపంలోని కొత్త చెరువుకట్ట తూము ధ్వంసం చేశారు. దీంతో చెరువులోని నీరు వృథాగా పోతుందని పట్టణంలోని బీజేపీ నాయకులు గురువారం ఇరిగేషన్ డీఈ శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్త చెరువు కట్ట తూమును అక్రమార్కులు ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. అధికారులు రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని చెరువులు కట్ట తూమును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు తాటి విఠల్, మాసాయిపేట అంజాగౌడ్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు జానకిరాం గౌడ్, దుర్గరాజు యాదవ్, మాజీ ఎంపీపీ గుమ్మడి శ్రీను, పోచెందేర్ తదితరులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ డీఈకి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ నాయకులు

సాగు పనులు షురూ

● వరి వైపే మొగ్గు చూపుతున్న రైతులు
● అందుబాటులో విత్తనాలు ఎరువులు




వరి నారు పెంచేందుకు మడుల్లో విత్తనాలను పోస్తున్న రైతు

కొల్చారం(నర్సాపూర్): మండల కేంద్రం కొల్చారంలో వరి 75 శాతం బోర్ల కింద సాగు చేస్తారు. వరి నారును పెంచేందుకు నారుమడులను సిద్ధం చేసే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు.

యాసంగి సాగు వివరాలు

మండలంలో వానాకాలంలో సాధారణ సాగు విస్తీర్ణం 20,562 ఎకరాలు కాగా యాసంగికి వచ్చేసరికి సాధారణ సాగు విస్తీర్ణం17,350 ఎకరాలు. ఈసారి యాసంగిలో వరి సాగు అత్యధికంగా 16,600 ఎకరాలు కాగా దాదాపు మరో 200 ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయనున్నారని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు. వరి పంట ఈ స్థాయిలో సాగు చేయడానికి ప్రధాన కారణం ఎక్కువగా రైతులు బోర్లపై ఆధారపడడం, మరోవైపు మండలంలో మంజీరా నదిపై ఉన్నటువంటి ఐదు ఎత్తిపోతల పథకాలు, మరో మూడు చెక్ డ్యాంలు ఉండడం. రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచేందుకు సంబంధిత వ్యవసాయ అధికారులు ఇప్పటికే అన్ని చర్యలు తీసుకున్నారు. సాగు విస్తీర్ణంకు అనుగుణంగా వరి విత్తనాలు 512.5 క్వింటాళ్లు, యూరియా 86 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 117 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2.25 మెట్రిక్ టన్నులు, ఎంఓపీ, ఎస్ఎస్పీ 20 మెట్రిక్ టన్నులు అవసరం ఏర్పడుతుందని అధికారులు తెలిపారు.

సూచనలు తప్పనిసరి



రైతులు విత్తనాలు, ఎరువులు కొనుగోలు విషయంలో అందుబాటులో ఉన్న వ్యవసాయ విస్తరణ అధికారుల సూచనలు తప్పనిసరిగా తీసుకోవాలి. విత్తనాలు ఎరువులు కొనే ముందు సంబంధిత దుకాణాల నుంచి రసీదులు పొందాల్సి ఉంటుంది. కొనుగోలు చేసిన విత్తనాలు మొలకెత్తకపోతే సమాచారం అందించినట్లయితే రైతు నష్టపోకుండా చూసేందుకు అవకాశం ఉంటుంది.

– శ్వేత కుమారి, ఏఓ, కొల్చారం